క్లుప్తంగా

మామిడిలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

రామాపురం : ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు గురువారం మండలంలోని రాచపల్లి, హసనాపురం గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయల కోత తర్వాత ఆచరించాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతుకు ఉద్యానవన శాఖ అధికారిణి టి.నాగమణి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ మామిడి తోటలలో కాయలు కోసిన అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది అఫ్సర్ అలీఖాన్, వెంకటరమణ పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ పెంచలమ్మ మృతి

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ సుంకేసుల పెంచలమ్మ గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. ఆమె ఆకస్మిక మృతి పట్ల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పంజం వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్‌లు దార్ల చంద్రశేఖర్, గోపి, ఎంపీటీసీలు జనార్దన్‌రాజు, బండారు మల్లిలు సంతాపం వ్యక్తం చేశారు. పెంచలమ్మ సర్పంచ్‌గా రెండు సార్లు గెలుపొందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



క్యూలైన్ల ఏర్పాటు కోసం జరుగుతున్న పనులు

రాజంపేట : సౌమ్యనాథ బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 27 నుంచి మొదలయ్యే ఉత్సవాలకు తితిదే సర్వం సిద్ధం చేస్తోంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, భక్తులకు క్యూలైన్లు, అన్నప్రసాదాల వితరణకు షెల్టర్లు నిర్మిస్తున్నారు. అలాగే జులై4న జరిగే కల్యాణోత్సవానికి వేదిక, భక్తులకు కూర్చునేందుకు చేయాల్సిన చర్యలను తీసుకుంటున్నారు. ఆలయంలో ద్వారపాలకులకు కవరింగ్, స్వామివారు ఊరేగే వాహనాలను ముస్తాబు చేస్తున్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయురాలు

పెనగలూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రభుత్వ పాఠశాలలకు ఆర్‌బీఐ వారు ఆల్ ఇండియా క్విజ్ ఫైనాన్సియల్ లిటరసీ 2023పై పోటీలు నిర్వహించారు. మండలస్థాయి పోటీలలో మోడల్ స్కూల్ విద్యార్థునులు మౌనిక, గోపి చందనలు ప్రథమ బహుమతి సాధించి రూ.5 వేలు నగదు అవార్డు, సర్టిఫికెట్లు పొందారు. దీంతో విద్యార్థునులను మోడల్ స్కూల్ పాఠశాల సిబ్బంది అభినందించారు. జగనన్న ఆణిముత్యాలలో భాగంగా పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి కింద రూ.3 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.2 వేలు, తృతీయ బహుమతి కింద రూ.1000లు చొప్పున విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల కమిటీ చైర్మన్ శివకుమార్ ద్వారా అందించారు. నగదుతోపాటు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు.

వేలం ద్వారా ఆలయానికి ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

రాయచోటి టౌన్ : బహిరంగ వేలం ద్వారా వీరభద్రస్వామి ఆలయానికి ఆదాయం పెరిగిందని ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవి రమణారెడ్డిలు తెలిపారు. గురువారం ఆలయానికి చెందిన గది వేలం (హైకోర్టు ఆదేశాలతో) వేలం పాట నిర్వహించారు. గతం కంటే వేలంలో ఎక్కువగా పలికింది. దీంతో ఆలయ ఆదాయం పెరిగిందని తెలిపారు. గతంలో ఆలయానికి చెందిన గది ఆదాయం రూ.8 వేలు కాగా ఇప్పుడు దాని ఆదాయం రూ.41,600లుగా పలికింది. అలాగే ఇక సంవత్సరానికి ఆలయంలో షామియానా, కుర్చీలు, వంటపాత్రలు, టేబుళ్లు, పూల డెకరేషన్‌లకు గత సంవత్సరం రూ.1.2లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.1.25లక్షలకు పెరిగింది. ఫొటోలు, ల్యామినేషన్ ఫోటోలు అమ్ముకొనే హక్కు కోసం గత సంవత్సరం 1.15లక్షలు ఉండగా ఇప్పుడు రూ.1.20లక్షలకు చేరింది. దేవాదాయశాఖ తనిఖీ అధికారి జనార్దన్ పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, నాగభూషణం, సురేష్, విజయమ్మ పాల్గొన్నారు.

బీసీలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు బలహీనవర్గాలకు పేదలకు పెద్దపీట వేయడం జరిగిందని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని పెమ్మాడపల్లె, దళితవాడలలో గడప గడపకు మన ప్రభుత్వంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, ఎంపీపీ పల్లపు రాజమ్మ, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, బీసీ నేత పల్లపు రమేష్, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీలకు ప్రభుత్వం చేయని విధంగా బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ అని ప్రభుత్వం నిరూపించిందన్నారు. వైఎస్‌ఆర్ చేయూత, నేతన్న నేస్తం, రజకులు, టైలర్లు, నాయీబ్రాహ్మణులు, ఆటోవాలాలకు ఆర్థికసాయం, బీసీలకు చెందిన విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా సింహభాగం బీసీలు లబ్ధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాలనలోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. 53 కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాయీబ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే జగన్ ప్రభుత్వం అరుదైన గుర్తింపు, విలువలను ఇచ్చిందన్నారు.

సొంతింటి కల సాకారం..

పేదల సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గరుగుపల్లె జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. గృహ నిర్మాణాలలో వేగం పెంచాలని సూచించారు. పట్టణానికి దగ్గరగా ఉన్న ఈ లే అవుట్‌లో అన్ని మౌలిక వసతులను కల్పించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 93 జగనన్న కాలనీలు నిర్మాణమవుతున్నాయన్నారు.



లబ్ధిదారుకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సంబేపల్లె : శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మీయస్వాగతాలు..

ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ఇంటింటా ఆత్మీయస్వాగతాలు పలికి అక్కున చేర్చుకున్నారు. తొలుత ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఇళ్ల పట్టాల కోసం ఒక ఎకరా స్థలాన్ని రెవెన్యూ అధికారులు సేకరించి చూపిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు మంజూరు చేయిస్తామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

దళితుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు, లోకేష్

దళితుల మనోభావాలను చంద్రబాబు, లోకేష్‌లు దెబ్బతీశారని దళితవాడ వాసులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎదుట గుర్తు చేసుకున్నారు. గతంలో దళితులలో ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాట్లాడారని, ఇప్పుడు లోకేష్ దళితులు ఏమి పీకుతారు అంటూ మాట్లాడారని ఆ ప్రాంతాల ప్రజలు గుర్తు చేసుకున్నారు. దళితులను ద్వేషించే వ్యక్తి చంద్రబాబు అని, దళితులను గుండెల్లో పెట్టుకునే వ్యక్తి జగన్ అని దళిత ప్రజలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, అరమాటి గంగిరెడ్డి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, తిరుపాల్‌నాయుడు, దివాన్, పల్లపు శివయ్య, నరసింహులు, భాస్కర్, రామాంజులు, ఆరమాటి గణేష్‌రెడ్డి, రజనీకాంత్, మడితాటి రెడ్డయ్య, కోటకొండ పాపయ్య, వెంకటరమణ, ఆరమాటి రాజారెడ్డి, ముదిశెట్టి రామాంజులు, ఆరమాటి విశ్వనాథ, జనార్దన్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే

సంబేపల్లె : మండల కేంద్రంలో సంబేపల్లె గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి మెడికల్ స్టోర్ అన్నారెడ్డి నివాసంలో గురువారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మండల కేంద్రంలోని గృహేశ్వరి పశుపతినాథ ఆలయంలో రూ. 1.20 కోట్ల నిధులు, దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం రూ.1.18 కోట్లతో జరుగుతున్న నిర్మాణపు పనులపై ఆరాతీశారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్, ఆదర్శపాఠశాల అదనపు తరగతి గదులపై చర్చించారు. గ్రామంలో జరుగుతున్న జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, నాయకులు వి.వి. ప్రతాప్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించండి

రాయచోటి టౌన్ : అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం ఆశిస్తున్న లక్ష్యాలను సాధించాలని, ఆ దిశగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య పరిధిలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూలలో ఎంపికైన 12 మంది అభ్యర్థులకు గురువారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు విద్యతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తల్లి పాత్రను పోషించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్లు ఉదయకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ పాత్తూరు రవీంద్రానాయుడు, సర్పంచ్‌లు పాల వెంకటరమణ నాయుడు, పుల్లగూర వెంకటరమణ, ఎంపీటీసీ రెడ్డెప్ప, నాగశేషారెడ్డి, కో-ఆప్షన్ సయ్యద్ అమీర్, ఎంపీటీసీ లక్ష్మినారాయణ, బండ్రేవు శంకరరెడ్డి, అలీబాషా, ఎంపీడీఓ మల్‌రెడ్డి, సీడీపీఓలు పాల్గొన్నారు.

పండుగను శాంతియుతంగా జరుపుకోండి

ఓబులవారిపల్లె : బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ముస్లింలు, హిందువులు సోదరభావంతో మెలగాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకూడదని సూచించారు. కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, హెడ్ కానిస్టేబుల్స్ రామచంద్రయ్య గౌడ్, వలి, షేక్ మస్తాన్ వలి, సయ్యద్ మౌలా బాషా, ఖాదర్ సాహెబ్, షేక్ ఖలీల్, సుబ్బరాయుడు ఆచారి, బాలసుబ్రమణ్యం, ఉపేంద్ర, మల్లికార్జున, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

సిద్దవటం : మండలంలోని సిద్దవటం - భాకరాపేట మార్గ మధ్యలో ఉన్న పరమాత్మ సేవా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి సుబ్బమ్మ మూడవ వర్ధంతిని పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశానని పేర్కొన్నారు.

నిత్యావసరాల అందజేత

రైల్వేకోడూరు : మండలంలోని దేశెట్టిపల్లిలో ఉన్న అనాథ శరణాలయంలో గురువారం కడప విద్యుత్ సామాజిక సేవ సంస్థ ద్వారా నిత్యావసర సరుకులు, బియ్యం, చింతపండు, కూరగాయలను అందజేశారు. కార్యక్రమంలో కడప ఎస్‌ఈ రమణ, సామాజిక సేవ అధ్యక్షుడు చలపతి, ఈఈ నాగరాజు, డీఈఈ భరణి క్రిష్ణ, డీఈఈ భాస్కర్‌రావు, ఏఈ యోగానంద, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి

రాజంపేట రూరల్ : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)కి రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య, ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. స్థానిక రెడ్డి వారి వీధిలో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభించారు. అనంతరం వీరు మాట్లాడుతూ నేటి విద్యార్థులు భావితరాలకు పునాదులని కొనియాడారు. వారి ఆరోగ్యం కోసం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశామని తెలియజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఈ వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె. శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలి మురళీరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఒ.శివారెడ్డి, కార్యదర్శి పి.జనార్దన రెడ్డి, ట్రెజరర్ ఎం.శ్రీనివాసయాదవ్, ప్రతినిధులు పి.విశ్వనాథరెడ్డి, బి.రామ్మోహన్‌నాయుడు, శేఖర్ రెడ్డి, ఎస్.నవీన్, ఆర్.రాఘవేంద్రవర్మ, డి.పెంచలయ్య, డాక్టర్ ఎ.అమర్, బి.నరేష్, పి.శంకరశెట్టి, ఎం.శ్రీనివాసులగౌడ్, ఐటీఐ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట సబ్ డివిజన్ ఆఫీస్‌లో విద్యుత్ వినియోగదారులకు, విద్యుత్ సిబ్బంది వినియోగానికి వాటర్ ప్లాంట్‌ను గురువారం కడప ఆపరేషన్ ఎస్‌ఈ ఎస్.రమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సామాజిక సంఘం అధ్యక్షుడు, కన్‌స్ట్రక్షన్ ఈఈ డి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చలపతి, రాజంపేట ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ మురళీధర్ రెడ్డి, ఏఈ ఉదయ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్ ఎన్. భరణి కృష్ణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కానుక రికార్డుల పరిశీలన

సిద్దవటం : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మంజూరైన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫామ్‌కు సంబంధించి జేవీకే యాప్‌లో విద్యార్థుల చేత బయోమెట్రిక్ వేయించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు తెరవగానే ప్రభుత్వం పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి రూ. 2,400 విలువ చేసే కిట్‌ను విద్యార్థులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సిద్దవటం దిగువపేట బేల్దారి వీధిలోని ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో గురువారం ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాలెం ఓబయ్య, విశాలాక్షి, గీత, స్వర్ణలత, జేవీకే యాప్ నందు విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు షేక్ కరిమున్నీసా, లక్ష్మిప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండల పరిధిలోని జగనన్న విద్యా కానుక పంపిణీకి సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటిఫికేషన్‌ను గురువారం ఎస్‌ఎస్‌ఏ టీం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల శాఖ పాయింట్ నుంచి పాఠశాల స్టాక్ పాయింట్‌కు వెళ్లిన జగనన్న విద్యా కానుకలను జేవీకే యాప్‌లో వివరాలను పరిశీలించారు. జగనన్న విద్యా కానుకలకు సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ నమోదు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీం సభ్యులు జిల్లా ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ లక్ష్మినారాయణ రాజు, సీఎంఓ కేశవరెడ్డి, ఎస్‌ఎస్‌ఏ కంప్యూటర్ ఆపరేటర్ భాస్కర్, ఒంటిమిట్ట మండల విద్యా శాఖ అధికారులు జి.వెంకట సుబ్బయ్య, డి.ప్రభాకర్, ఒంటిమిట్ట ఎంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్లు నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం: బయోమెట్రిక్ వేయిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రాయచోటి అర్బన్ : యువత, విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీఎస్పీ బి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాల సేవించడం వలన అనారోగ్యానికి గురవుతారన్నారు. మత్తుకు బానిసైతే మనిషి కేంద్ర నాడీ మండల వ్యవస్థ దెబ్బతిని అనారోగ్యానికి గురై ఆర్థికంగా, శారీకంగా, మానసికంగా ఇబ్బందుల పాలవడమే కాకుండా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలవుతారంటూ వివరించారు. కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన రోడ్డు ప్రమాదాలు, క్షణికావేశంలో తీసుకునే ప్రమాదకర నిర్ణయాలతో యువత భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది విద్యార్థుల చేత మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ బి.వినోద్‌కుమార్

నేతాజీ ఆశయసాధనకు కృషి చేస్తాం

రాయచోటి అర్బన్ : భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయసాధన కోసం కృషి చేస్తామని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కాలేషా అన్నారు. అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 84వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో కాలేషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటం సాగించడంలో ఫార్వర్డ్‌బ్లాక్ ఎల్లవేళలా ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ నేతలు అజంతుల్లా, ఖాజా హుస్సేన్, సమీర్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌బీ నేతలు

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8వ తరగతులలోని ఖాళీలను భర్తీ చేయడానికి గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శ్యామలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 24న ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత, ప్రతిభ రోస్టర్ ఆధారంగా ఎంపికలు జరుగుతాయని ఆమె తెలిపారు.

లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్..

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన 7,8,9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈనెల 28వ తేదీలోగా ఆధార్ కార్డు జిరాక్స్ తగు సర్టిఫికెట్లతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్ష నిర్వహించి విద్యార్థులను మెరిట్ ద్వారా ప్రవేశం ఉంటుందని తెలియజేశారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : భాకరాపేట చెక్ పోస్టు వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. 34 మంది వాహనాదారులపై కేసులను నమోదుచేసి వారికి రూ. 5,090 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రైతాంగానికి నిరంతరం అండగా ప్రభుత్వం



పసుపు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : పసుపు రైతులకు మేలు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు రైతులతో భేటీతోపాటు డీసీఎంఎస్ పసుపు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. గ్రేడింగ్‌లో పర్సంటేజీని బట్టి ధరల విషయంలో రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను తీసుకొస్తున్నారన్నారు. పసుపు రైతులు తన దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతాంగానికి ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందన్నారు.


రైతు కష్టాల్లో పాలుపంచుకొని, ఆదుకునే ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు టి.త్యాగరాజు, వ్యవసాయ మార్కెట్ అధికారులు, రైతులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను పక్కాగా అమలుపరచాలి

చిన్నమండెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా అమలుపరచాలని ఎఫ్‌ఏసీ మండలాధికారి దివాకర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పడమటికోన గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు విధి విధానాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివాకర్‌నాయక్ మాట్లాడుతూ నేటి నుంచి నెల రోజులపాటు పలు రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా చేపట్టనుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు బాబురెడ్డి, సర్పంచ్ జగన్నాధరెడ్డి, పార్టీ నాయకులు అంజనప్ప, అశోక్‌రెడ్డి, గురివిరెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష టీంల ఏర్పాటు

జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై మండల వ్యాప్తంగా రెండు టీంలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రహీం ఒక ప్రకటనలో తెలిపారు. టీం-1లో తహసీల్దార్, పీఆర్ అండ్ ఆర్‌డీ ఈఈలు ఉండగా టీం-2లో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్‌లు ఉన్నట్లు చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఈ విధంగా ఉండనున్నట్లు చెప్పారు. జులై 1న టీం-1 బోరెడ్డిగారిపల్లె, టీం-2 చిన్నమండెం-2, జులై 4న బోనమల గ్రామంలో టీం-1, దేవలంపేట గ్రామంలో టీం-2, జులై 7న టీం-1 చిన్నమండెం-1 సచివాలయం, టీం-2 దేవగుడిపల్లె, జులై 11న టీం-1న టి.సాకిబండ, టీం-2 దిగువగొట్టివీడు, జులై 14న టీం-1 మల్లూరు, టీం-2 కొత్తపల్లె, జులై 18న టీం-1 వండాడి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ తెలియజేశారు.



చిన్నమండెం: మాట్లాడుతున్న దివాకర్‌నాయక్

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సమస్యలు పరిష్కరించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిన్నఓరంపాడు, చిన్నంపల్లి, పెద్దఓరంపాడు, యల్లాయపల్లి, ముక్కవారిపల్లి, కొర్లకుంట సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సాయికిషోర్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సచివాలయాలలో 11 రకాల సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, నివాసిత, బర్త్, డెత్, కౌలురైతు కార్డులు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, అప్‌డేట్, నూతన రేషన్ కార్డులలో యాడింగ్, డెలిటింగ్, పట్టాదారు పాసుపుస్తకం తదితర సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. మండలంలో ఒక్కో టీమ్‌లో ముగ్గురు అధికారులతో రెండు టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, జేసీఎస్ కన్వీనర్ అమరనాథరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి, సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి, ఎంఎల్‌ఓ బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, బీఆర్ ప్రేమ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం నేడు ఉదయం 9.30గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమ వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ్యులు, ప్రజాప్రతినిధులు అందరూ హాజరుకావాలని తెలియజేశారు. ఇందులో ప్రజలకు 11 రకాల సేవలను అందించనున్నామని, దీనిని సద్వినియోగంలో చేసుకోవాలని తెలియజేశారు.